# గట్టెక్కిన కష్టాలు




- 59వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు
- నూతన మెట్ల మార్గాలు, రోడ్ల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న కొండ వాలు ప్రాంత ప్రజలు

**నాడు:** జీవీఎంసీ 59వ వార్డులోని కొండ వాలు ప్రాంతాల్లో మెట్లు మార్గాలు పూర్తిగా శిథిలావస్థలో ఉండేవి. సీసీ మెట్లు విరిగిపోయి నడవడానికి వీల్లేని విధంగా ఉండేవి. మట్టిరోడ్లతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడేవారు.

**నేడు:** ఆ పరిస్థితి లేదు. శిథిలమైన మెట్ల మార్గాలను లక్షల రూపాయలతో ఆధునికీకరించారు. వాటి రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. కొండవాలు ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధిని చూసిన ఆయా ప్రాంత వాసులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



59వ వార్డు హనుమాన్‌సంజీవ్‌కాలనీలో మార్గం దుస్థితి



రూ. 20 లక్షలతో హనుమాన్‌సంజీవ్‌కాలనీలో వేసిన మార్గం

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు పరిధిలో అధికంగా కొండ ప్రాంతాలే ఉన్నాయి. పలు ప్రాంతాలకు చెందిన వలస కార్మికులు ఆయా కొండ ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. అయితే వారు నడిచేందుకు, వాడుక నీరు పోయేందుకు సరైన కాలువ, మార్గాలు మాత్రం ఉండేవి కావు. ఇలాంటి సమస్య వార్డు పరిధిలో హనుమాన్‌సంజీవ్‌కాలనీ, నక్కవానిపాలెం, హిమాచల్‌నగర్, గంగానగర్, గణపతినగర్, వాయుపుత్రకాలనీ, శాంతిగిరికాలనీ కొండ ప్రాంత ప్రజలు ఎదుర్కొనేవారు. అయితే గతేడాది అక్టోబర్, నవంబర్ నెలలో ఆయా కొండ ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆ ప్రాంతానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు ఆయా ప్రాంతాల ప్రజలు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆనంద్‌కుమార్ జీవీఎంసీ ఉన్నతాధికారులతో మాట్లాడి కొండ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేలా చేశారు. దీంతో మెట్లు, వీధి కాలువలను ఆధునికీకరించారు.






నక్కవానిపాలెం మార్గం

రూ. 18 లక్షలతో నక్కవానిపాలెం కొండ ప్రాంతంలో వేసిన మార్గం

## వార్డులో వేసిన రోడ్లు, మెట్ల మార్గాలకు చేసిన ఖర్చు

- ములగాడ హౌసింగ్‌కాలనీ పరిధిలో సీసీ రోడ్డు : రూ. 25 లక్షలు
- శాంతినగర్ కొండ ప్రాంతంలో సీసీ రోడ్డు, సీసీ మెట్ల మార్గం: రూ. 16 లక్షలు
- హిమాచల్‌నగర్ కొండ ప్రాంతంలో సీసీ రోడ్డు : రూ. 30 లక్షలు
- వాయుపుత్రకాలనీ పరిధిలో సీసీ రోడ్డు : రూ. 30 లక్షలు
- ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీలో బీటీ రోడ్డు నిర్మాణం: రూ. 29.50 లక్షలు
- నక్కవానిపాలెంలో సీసీ రోడ్డు, మెట్లు మార్గం : రూ. 20 లక్షలు
- హిమాచల్‌నగర్ కొండ ప్రాంతంలో సీసీ రోడ్డు, సీసీ మెట్లు : రూ. 30 లక్షలు
- హిమాచల్‌నగర్ ప్రాంతంలో బీటీ రోడ్డు : రూ. 10 లక్షలు

### రూ. 6 కోట్లతో అభివృద్ధి పనులు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించినప్పుడు ఆయా ప్రాంత ప్రజలు వారి సమస్యలను వివరించారు. గత పాలకులు ఇన్నాళ్లు ఏం చేశారని ఆశ్చర్యం వేసింది. వారి సమస్యలను పరిగణలోకి తీసుకుని అధికారులతో మాట్లాడి నిధులు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాం. ఇప్పటి వరకు 59వ వార్డులో రూ. 6 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేశాం. మరో రూ.4 కోట్లతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం.

– ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త

### గతంలో అభివృద్ధి కానరాలేదు



నాడు మా ప్రాంతాలకు అధికారులకు గానీ, నాటి పాలకులకు గానీ వచ్చేవారు కాదు. ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చేవారు. కొండ ప్రాంతంలో సమస్యలను వివరించినా వారు పెడచెవిన పెట్టేవారు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మా సమస్యలపై స్పందించింది. వాటిని పరిష్కరించే విధంగా చొరవ చూపారు.

– రేవళ్ల సత్యనారాయణ, ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ

### ఆనందంగా ఉంది



నక్కవానిపాలెం కొండ ప్రాంతంలో మెట్లు మార్గం చాలా అధ్వానంగా ఉండేది. కనీసం నడిచేందుకు ఇబ్బంది పడేవాళ్లం. వర్షాల సమయంలో జారి పోయి గాయాలయ్యేవి. నేడు మా ప్రాంతంలో మెట్లు మార్గాన్ని ఆధునికీకరించి మోక్షం కల్పించారు. ఈ ప్రభుత్వానికి మా అభినందనలు.

– ఖాన్, నక్కవానిపాలెం కొండ ప్రాంతం

### మార్గం చూపారు



హనుమాన్‌సంజీవ్‌కాలనీలో మెట్ల మార్గం పూర్తిగా శిథిలమైంది. గుంతలు ఏర్పడి ఉండేది. పగలే ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు పడేవారం. రాత్రి అయితే ఆ మెట్ల మార్గంలో వెళ్తే ఎక్కడ గాయాలవుతాయో అని భయంతో ఇంట్లో ఉండాల్సిన పరిస్థితి. నేడు ఈ ప్రభుత్వం మా సమస్యను గుర్తించి మెట్ల మార్గాన్ని పూర్తిగా ఆధునికీకరించి మాకు మార్గం చూపింది.

–వరలక్ష్మి, హనుమాన్‌సంజీవ్‌కాలనీ

# జగనన్నకు ఘన స్వాగతం పలుకుదాం

- కార్యకర్తలు, అభిమానులకు బెహరా పిలుపు

**గోపాలపట్నం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖ శ్రీ శారదా పీఠానికి వస్తున్న నేపథ్యంలో ఘన స్వాగతం పలికేందుకు కార్యకర్తలు నాయకులు, అభిమానులు తరలి రావాలని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఇంటి వద్ద కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో విశాఖ విమానాశ్రయం నుంచి రహదారికి ఒక వైపు నిల్చుని సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. అందులో భాగంగా 91, 92 వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 91వ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీ కృష్ణ, బండారు వరలక్ష్మి, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


కార్యకర్తలతో మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

**తరలిరండి**

**సింధియా:** విశాఖ పర్యటనకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు వార్డు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ 63వ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి కోరారు. పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సూచనల మేరకు మంగళవారం ముఖ్యనాయకులతో సమీక్షించారు. ఎయిర్ పోర్టు నుంచి క్రమ శిక్షణతో ఉండి సీఎం జగన్‌కు అపూర్వ స్వాగతం పలకాలని నిర్ణయించారు. సమావేశంలో వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్, సూరాడ పెంటారావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ 63వ వార్డు ముఖ్య నాయకులు

# పారిశ్రామిక రంగంలో అద్భుత ప్రగతి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆనంద్‌కుమార్

- 'పశ్చిమ' ఇన్‌చార్జి ఆడారి ఆనంద్‌కుమార్
- 59, 60వ వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**మల్కాపురం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధిస్తోందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. టీడీపీ హయాంలో గ్రాఫిక్స్ తప్పా రాష్ట్రంలో ఎక్కడా చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదన్నారు. దీంతో వారికి వచ్చే ఎన్నికల్లో ప్రజలకు ఏం చెప్పాలో తెలియక తప్పుడు ఆరోపణలు చేస్తూ.. మరో వైపు కూటమి కోసం పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీలో వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ ఆధ్వర్యంలో సుమారు రూ. 35లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న సామాజిక భవన నిర్మాణ పనులకు, 59వ వార్డు హనుమాన్‌సంజీవ కాలనీలో రూ.25.83 లక్షలతో కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాలు, సీసీ డ్రైన్లు, సీసీ కాలువ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు.

భవిష్యత్తులో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి జగన్‌హన్‌రెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. విశాఖనగరం మోస్ట్ హ్యాపెనింగ్ సిటీ కానుందని, పరిపాలన రాజధానికి తగ్గట్టుగానే అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో అంగరాంప్రసాద్, హరీష్, అనిల్, మళ్ల ధనలత, హనుమంతరావు, గుంత చంద్రరావు, సూర్య, భాస్కరరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# వైభవంగా పైడిమాంబ ఉత్సవం




ప్రత్యేక అలంకరణలో పైడిమాంబ, కోలాట బృందంతో ఆలయ నిర్వాహకులు

- మారు వారం పూజలకు తరలి వచ్చిన భక్తజనం
- ఆకట్టుకున్న కోలాట నృత్యాలు

**విశాఖ విద్య:** జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజు పాలెం వాసుల ఆరాధ్య దేవత పైడిమాంబ మారు వారం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. గర్భగుడిలో అమ్మవారికి ఉదయం ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గ్రామ దేవతగా కీర్తిగాంచిన పైడిమాంబ అమ్మవారికి గత మంగళవారం ఉత్సవాన్ని నిర్వహించారు. అయితే ఆ రోజున వివిధ కారణాలతో అమ్మవారిని దర్శించుకోలేని భక్తులకు, మరో మారు అమ్మవారి మూర్తులను కనులారా వీక్షించే అవకాశం కల్పించేలా మారువారం ఏటా నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన గ్రామ దేవతను చూసి భక్తులు తరించారు. దేవదాయ శాఖ ఈవో పీఎస్ఎన్. మూర్తి, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పూరెడ్డి ప్రకాశ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. సాయంత్రం మహిళా భక్తులు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. మాజీ కార్పొరేటర్ మళ్ల అప్పారావు, కమిటీ సభ్యులు చుక్కా అన్నపూర్ణ, రవీంద్ర, గోపి, నాగేంద్రరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## ప్రభుత్వ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ

**విశాఖ లీగల్:** ప్రభుత్వం అందిస్తున్న ఫలాలను ప్రతి ఒక్కరికి పారదర్శకంగా అందేలా అధికారులు కృషి చేయాలని విశాఖ జిల్లా న్యాయసేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ కోరారు. మంగళవారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని జిల్లా కోర్టులోని న్యాయ సేవ ప్రాధికార సంస్థ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సామాజిక న్యాయ ఫలాలకు దూరం కాకూడదన్నారు. సీనియర్ న్యాయవాది ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలందరికీ అవసరమైన సేవలను ఇంటి వద్దకే అందిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి ఎంఎస్ శోభారాణి, పరిపాలన అధికారి ఎస్ఎస్ఎస్ఎన్ శర్మ, అధికారులు అంజనేయులు, ఎస్.చిన్నారావు, శ్యామల, సహాయ సంక్షేమ అధికారి పూర్ణిమ దేవితో పాటు అనకాపల్లి, ఏఎస్ఆర్ జిల్లా అధికారులు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.

# శాస్త్రోక్తంగా శత సువాసినీ పూజ


అనుగ్రహ భాషణం చేస్తున్న మాతా రమ్యానంద భారతి


అష్టోత్తర శత సువాసినీ పూజ చేస్తున్న మహిళలు

**సీతంపేట:** అమృతోత్సవం పేరిట శ్రీలలితాపీఠం 75వ వార్సికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. విశేష పూజలు నిర్వహిస్తున్నారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో రెండో రోజు యాగశాలలో మండపారాధనలు, కలశస్థాపన, అగ్ని ప్రతిష్ట, రక్షోఘ్న గణపతి హోమం, మణిద్వీప దేవతా విశేష పూజలు నిర్వహించారు. కుర్తాళం పీఠ పురోహితులు మాచవోలు రమేష్ శర్మ పర్యవేక్షణలో వేద పండితులు విశేష పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం పీఠం దర్బారు హాల్లో సామూహిక లలితాసహస్రనామ పారాయణ, అష్టోత్తర శత సువాసినీ పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి అనుగ్రహ భాషణం చేశారు. బుధవారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీభూనీలా సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరుగుతుందని, భక్తులు పాల్గొని తరించాలని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ కోరారు.

# మానసిక ఆరోగ్యం ప్రధానం

**ఏయూ క్యాంపస్:** మానసిక ఆరోగ్యం ప్రతి వ్యక్తి జీవితంలో ఎంతో ప్రధానమైనది సైకాలజిస్ట్ మౌనికారావు అన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం సమావేశ మందిరంలో మంగళవారం ప్రోగ్రాం అధికారులకు ఆదిత్యబిర్లా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఎంపవర్ కార్యక్రమంలో భాగంగా న్విహించిన మానసిక ఆరోగ్య శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యక్తుల ఆలోచనలు, ఉద్రేకాలు, ప్రవర్తన, వైఖరులు, మానసిక ఆరోగ్యాన్ని సూచిస్తాయన్నారు. మానసిక ఆరోగ్యంపై అవగాహన వల్ల ప్రజలు తమ శక్తి సామర్థ్యాలను పూర్తిగా తెలుసుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపవర్ కార్యక్రమ స్టేట్ కోఆర్డినేటర్ బి.సుధాకరరావు మాట్లాడుతూ ఒత్తిడిని తట్టుకుని మాట్లాడడం, అధిగమించే విధానాలను వివరించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ యువత ఎదుర్కొనే మానసిక సమస్యలకు తగిన పరిష్కారాలు చూపడం, మార్గనిర్దేశం చేయడం ఎంతో అవసరమన్నారు. అనంతరం ప్రోగ్రాం అధికారులకు ఎంపవర్ కార్యక్రమ నిర్వాహకులు శిక్షణ సామగ్రితో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం విశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు

## 1104వ రోజుకు 'ఉక్కు' దీక్షలు


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

**కూర్మన్నపాలెం:** కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలనే దుర్మార్గపు ఆలోచనను విరమించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1104వ రోజు మంగళవారం పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రజల సంపదైన విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్త ఉద్యమాలకు సిద్ధమన్నారు.

## క్లుప్తంగా

### విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


విద్యార్థులు, ఉపాధ్యాయులతో గురుకులాల కన్వీనర్ రూపవతి

**విశాఖ విద్య:** విద్యార్థులు చదువుతో పాటు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించేలా తోడ్పాటు అందిస్తామని సాంఘిక సంక్షేమ గురుకులాల ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ ఎస్. రూపవతి అన్నారు. క్రియేటివ్ ఫైన్ ఆర్ట్ అకాడమీ, రాష్ట్ర క్రియేటివిటీ కల్చర్ ఆధ్వర్యంలో గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో పాల్గొని గోల్డ్‌మెడల్స్ సాధించిన శ్రీకృష్ణాపురం గురుకుల విద్యార్థులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు నాలుగు గోల్డ్ మెడల్స్, మూడు సిల్వర్ మెడల్స్‌తో పాటు వివిధ కేటగిరీల్లో బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఆర్ట్ ఉపాధ్యాయుడు పి. సుధాకర్, ప్రిన్సిపాల్ రత్నవల్లిని ప్రత్యేకంగా అభినందించారు.

### అపార్ట్‌మెంట్‌లో చోరీ

**పెందుర్తి:** పెందుర్తి సూర్యనగర్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. కామాక్షి అపార్ట్‌మెంట్‌లోని 202లో నివాసం ఉంటున్న కున్ని శెట్టికి చెందిన రెండున్నర తులాల బంగారం, పది తులాల వెండి అపహరించుకుపోయారు. వివరాలు.. కున్ని శెట్టి గతేడాది ఆగస్టులో ఫ్లాట్‌కు తాళం వేసి బెంగళూరులోని కుమార్తె ఇంటికి వెళ్లింది. అయితే ఆదివారం సదరు ఫ్లాట్ తాళాలు పగలగొట్టి ఉన్నాయని పొరుగువారు కున్నీకి సమాచారం అందించారు. దీంతో అక్కయ్యపాలెంలో నివాసం ఉంటున్న కున్నీ స్నేహితురాలు జ్యోతి రాణిని ఘటనాస్థలికి పంపింది. జ్యోతి ఇంటికి వచ్చి పరిశీలించగా బీరువాలో ఉన్న బంగారం, వెండి చోరీకి గురైనట్లు గుర్తించింది. వెంటనే పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దొంగలు అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి.

### పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న సమతాయాదవ్

**సింధియా:** జీవీఎంసీ 61వ వార్డు ప్రాంతానికి చెందిన సమతాయాదవ్ మంగళవారం సాయిసమతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆశ్రమంలో ఉంటున్న పేద విద్యార్థులకు అవసరమైన పుస్తకాలతో పాటు భోజనాలు అందించారు. ఈ సందర్భంగా సమతా మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు ఎంతోకొంత సాయం చేయాలనే ఆలోచనతో ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సత్యాయాదవ్, సాయి యాదవ్, మనోజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### సుందరీకరణ పనుల పర్యవేక్షణ


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

**పెందుర్తి:** నగరంలోని ఎన్ఏడీ నుంచి చినముషిడివాడ వరకు బీఆర్‌టీఎస్ రహదారిపై జరుగుతున్న సుందరీకరణ పనులను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ మంగళవారం పరిశీలించారు. బుధవారం ఉదయానికి పనులన్నీ పూర్తి కావాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జెడ్సీ హేమావతి తదితరులు ఉన్నారు.